క్లుప్తంగా

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

కనిగిరి రూరల్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శోభకృత్ నామ సంవత్సరంలో అందరికీ శుభాలు కల్గాలని ఆకాంక్షించారు. తెలుగు నూతన సంవత్సరంలో పంట పొలాలు కళకళలాడాలని, రైతుల ఇంట సిరుల పండాలని, అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విరజిల్లాలన్నారు.

కందుకూరు అర్బన్: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శోభకృత్ నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

కందుకూరు: ప్రజలకు ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు లోగిళ్లలో ఉగాది పండుగ సరికొత్త శోభను తీసుకురావాలని, కుటుంబసభ్యులతో కలిసి ప్రతి ఒక్కరూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సింగరాయకొండ: శోభకృత్ నామ తెలుగు సంవత్సరం ఉగాదిని కొండపి నియోజకవర్గ ప్రజలందరూ సంతోషంగా నిర్వహించుకోవాలని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆకాంక్షించారు. ప్రజలు, పార్టీ శ్రేణులకు మంగళవారం ఓ ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



సచివాలయం తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

హనుమంతునిపాడు: మండలంలోని వేములపాడు సచివాలయాన్ని ఎంపీడీఓ ఎం.క్రిష్టారావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం సంక్షేమ పథకాల రికార్డుల పరిశీలించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో సక్రమంగా నిర్వహించని వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేములపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ ఎం. క్రిష్టారావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు హాజర్, మెనూ నిర్వహణ రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ సక్రమంగా అందించాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన విద్యా బోధన అందించాలని సూచించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి

సీఎస్‌పురం: పొదుపు గ్రూపుల సభ్యులు తాము తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఏపీఎం విద్యాసాగర్ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మంగళవారం పొదుపు గ్రూపుల వీఓఏలకు సమావేశం నిర్వహించారు. పొదుపు మహిళలు ఏర్పాటు చేసుకున్న పొట్టేలు పిల్లల యూనిట్లు, గేదెల యూనిట్లు గురించి సమీక్షించారు. సీఐఎఫ్ రికవరీ చేయాలని సూచించారు. సీసీలు మస్తాన్ రెడ్డి, కాశయ్య, వీఓఏ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించండి

సీఎస్‌పురం: విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అరివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవితాప్రియ అన్నారు. మండలంలోని అరివేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పదో తరగతి విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి



విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



పి నాగులవరంలో రాగిజావ అందజేస్తున్న ఎంపీపీ



సింగరాయకొండలో రాగిజావ పంపిణీ చేస్తున్న జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ అరుణకుమారి



మర్రిపూడిలో రాగిజావ అందిస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి

● మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పేద వర్గాల్లో విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జె. ప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నియోజవర్గంలో సుమారు 20 వేల మంది విద్యార్థులు ఈ పథకం ద్వార పోషకాహారం పొందనున్నట్లు వివరించారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వైస్ చైర్మన్‌లు పులిశాంతి గోవర్దన్, మాణిక్యరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, కౌన్సిలర్ తమ్మినేని సుజాత, స్థానిక కౌన్సిలర్ దేవరాజ్, శ్రీ రాం సతీష్, దాసరి మురళీ, రాజీవ్, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మస్తాన్‌బీ, ముకరంజీ బాషా, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, కంటు గురవయ్య, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు చింతంగుంట్ల కిషోర్, ఎంపీడీఓ మల్లికార్జునరావు, హెచ్ఎం ప్రసాద్‌రావు, సంజీవి, పాల్గొన్నారు. అలాగే జడ్పీ బాలికోన్నత పాఠశాలలో, కాశిరెడ్డి కాలనీ పాఠశాలల్లో జరిగిన రాగి జావ పథకాన్ని చైర్మన్ ప్రారంభించారు.

సీఎస్‌పురం: విద్యార్థుల ఆరోగ్యం కోసమే ప్రభుత్వం రాగిజావ అందిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రాగి జావ అందించే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీసీపల్లి: రాగిజావ విద్యార్థుల ఆరోగ్యానికి మరింత బలంచేకూర్చుతుందని వైస్ ఎంపీపీ చెరుకూరి సతీష్, హెచ్ఎం జి.కరుణకుమారి అన్నారు. మండలంలోని పెదఅలవలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని వారు ప్రారంభించారు. పీఎంసీ చైర్మన్ చెన్నుపాటి వెంకటేశ్వర్లు, డబ్బుగొట్టు భాస్కర్, మాజీసర్పంచ్ వడ్డెంపూడి శ్రీను, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామూరు: విద్యార్థులకు రాగిజావ పంపిణీతో మరింత పోషకాహారం అందనుందని ఎంఈఓ ఎన్. రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావ పంపిణీని ప్రారంభించారు. పీఎంసీ చైర్మన్ ఓగూరి తులసి, నాగి క్రిష్ణవేణి, ఓగూరి ఏడుకొండలు, పీఈటీ మస్తాన్‌బీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీని సర్పంచ్ కత్తి రాజారావు, కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేష్‌బాబు ప్రారంభించారు. హెచ్ఎం జీవీ సురేష్‌బాబు, అసిస్టెంట్ హెచ్ఎం బొప్పరాజు సుబ్బారావు, ఎంపీటీసీ ఉడుముల సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ కత్తి కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: రాష్ట్రప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీపీ రామన మహాలక్ష్మి అన్నారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగిజావ పంపిణీని మంగళవారం ప్రారంభించారు. పి.నాగులవరం హైస్కూల్‌లో ఎంపీపీ రామన మహాలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు రామన తిరుపతిరెడ్డి, జార్జి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ టి.దేవసహాయం, సింగిల్‌విండో చైర్మన్ కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు పి.నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు వై నాగూర్‌యాదవ్, యెలికె నారాయణ, ఎంఈఓ దాసుప్రసాద్, హెచ్ఎం టి.అంజనీదేవి, మండల కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉలవపాడు: మండలంలోని మదనగోపాలపురం ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ రాఘవరెడ్డి పిల్లలకు రాగిజావ పంపిణీని ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాగి జావతో పోషకాలు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ పంపిణీని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ యన్నాబత్తిన అరుణకుమారి ప్రారంభించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. రాగి జావ తాగితే శరీరానికి ఐరన్, కాల్షియం లభించడంతో పాటు రక్తహీనత తొలగిపోతాయన్నారు. ఎంపీటీసీ సోమిశెట్టి వాసవీదేవి, ఉప సర్పంచ్ షేక్ కరిముల్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎంవీ సుబ్బారావు, సవళం కోటేశ్వరరావు, షేక్ సుభాని పాల్గొన్నారు. బాల యోగినగర్ ప్రాథమిక పాఠశాలలో మండల జేసీఎస్ చైర్మన్ తన్నీరు సుబ్బారావు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ షేక్ సలీంబాషా, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్రిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరి భాస్కర్, ఎంఈఓ ఈవీ రంగయ్య, కోఆప్షన్ సభ్యుడు కోండ్రు ఇజ్రాయిల్, విద్యాకమిటీ చైర్మన్లు డి.శివరామయ్య, దాసరి సాల్మన్, హెచ్ఎం యు.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని దాసిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో రాగి జావ పంపిణీని ఎంఈఓ కు.సురేఖ ప్రారంభించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ నరసింహారావు, హెచ్ఎం సీహెచ్ ఆంజనేయులు, కె.రాజశేఖర్‌రెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

పొన్నలూరు: జగనన్న గోరుముద్ద పథకంతో విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందుతోందని జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు నూతనంగా రాగిజావ అందించారు. మంగినంపాడు ఎంపీపీ పాఠశాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, చెరువుకొమ్ముపాలెం జెడ్పీ పాఠశాల్లో జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి రాగిజావ అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్రబాబు, హెచ్ఎం బి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గ్లాసులు పంపిణీ

మండలంలోని నాగిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత ఈదర రాంబాబు మంగళవారం రూ.4 వేల విలువైన స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. దాతను ఎంఈఓ రవిచంద్రబాబు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.ధనమ్మ, సర్పంచ్ కె.మమత, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బి.వెంకట్రావు, ఎస్ఎంసీ చైర్మన్ బి.వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పాశ్చాహుస్సేని గంధ మహోత్సవం



దర్గాలో చాదర్ ఉంచి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: హజరత్ సయ్యద్ బాదేషా పాశ్చాహుస్సేనీ చిష్టివుల్ ఖాదరీ 125వ గంధ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా హజరత్ దర్గాను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. భక్తులు నియమనిష్టలతో మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విశిష్ట పూజల్లో మున్సిపల్ చైర్మన్

ఉరుసు సందర్భంగా దర్గాలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, మహబూబ్ ముంతాజ్ దంపతులు విశిష్ట పూజలు చేసి చాదర్ సమర్పించారు. కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానాఖాలక్ దంపతులు నైవేద్యం సమర్పించారు. అనంతరం దర్గాలో ముజావర్లు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు బన్ను, హన్ను, కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసుల యాదవ్, మాజీ ఎంపీటీసీ జిలాని, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొట్టు శ్రీను, పసుపులేటి అరుణోధర్, మాజీ వార్డు సభ్యుడు ఎస్‌ఎస్ రసూల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ నాయకులు ఎస్‌కే ఎం పీరా, సుభానీ, ఖాశింసా, సయ్యద్ నన్నేసా, సయ్యద్ నాయబా తదితరులు మున్సిపల్ చైర్మన్ దంపతులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

మర్రిపూడి: బాల్య వివాహాలు నిర్మూలించాల్సిన అవసరం ఉందని కేజీబీవీ ప్రిన్సిపాల్ సీతాబాయ్ పేర్కొన్నారు. మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రామంలో మంగళవారం కేజీబీవీ విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆడపిల్లలకు చిన్నవయస్సులో వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి బాలిక చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

సింగరాయకొండ: బాల్య వివాహాలతో కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పోటీలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు హెచ్ఎం హరేరామ్ తెలిపారు.

స్వచ్ఛత ఉత్సవ్‌లో భాగస్వాములు కావాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, కమిషనర్

కనిగిరి రూరల్: స్వచ్ఛత ఉత్సవ్‌లో మహిళలంతా భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో స్వచ్ఛత ఉత్సవ్ వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి పొడి చెత్తల ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ విభాగాల్లో కృషి చేస్తున్న మహిళలంతా అవార్డులకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 23 లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు పని కల్పించండి



జయవరంలో పశువుల కుంట పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శీనారెడ్డి

టంగుటూరు: ప్రతి ఉపాధి కూలీకి 100 రోజుల పని తప్పనిసరిగా కల్పించాలని డ్వామా పీడీ కె.శీనారెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని జయవరం, కాకుటూరివారిపాలెంలో పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. డ్వామా పీడీ మాట్లాడుతూ.. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గుర్తించిన పనులను ఏప్రిల్ ఒకటో తేది నుంచి చేపట్టాలని, కూలీల సంఖ్య మరింత పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. కాకుటూరివారిపాలెంలో హార్టికల్చర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. ఏపీఓ ఎం.సుభాషిణి, ఈసీ ఎల్.రవికుమార్, టీఏ లూథియానా, ఎఫ్ఏ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నాటక పోటీలకు ఆహ్వానం

లింగసముద్రం: రంగస్థల దర్శకేంద్రుడు, సినీ నటుడు మద్దెల రాఘవేంద్రరావు స్మారక చిహ్నంగా తొలిసారిగా తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటక పోటీలు మే 14, 15, 16 తేదీల్లో పెదపవని గ్రామంలో పావని ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎం.నాగేశ్వరరావు తెలిపారు. ప్రదర్శన పారితోషికం రూ.20 వేలు అందజేస్తామన్నారు. మొదటి బహుమతి రూ.25 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 9000136237, 7780764093 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ సంగ్రామ పాదయాత్ర

వెలిగండ్ల: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చేట్టిన సంగ్రామ పాదయాత్ర మంగళవారం వెలిగండ్ల నుంచి మరపగుంట్ల, నాగిరెడ్డిపల్లి కొట్టాలపల్లి మీదుగా సీఎస్‌పురం చేరింది. ఈ పాదయాత్రకు వెలిగండ్ల సర్పంచ్ టి. సురేష్‌బాబు మద్దతు తెలుపుతూ పాదయాత్రలో పాల్గొన్నారు.

జిల్లా కన్వీనర్ ఆదిమూలపు ప్రకాష్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్ మాదిగ, రాష్ట్రనాయకులు గోచిపాతల రవికుమార్‌మాదిగ, రావినూతల కోటయ్య, వెలిగండ్ల , సీఎస్‌పురం కన్వీనర్లు తగరం ఏసు, జేపీరాజు, పూనూరి క్రిస్టొఫర్ పాల్గొన్నారు.

గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం

మర్రిపూడి: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల ప్రత్యేకాధికారి ఉదయభాస్కర్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఆహార పక్షోత్సవాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు చిరుధాన్యాలతోపాటు మునగాకును ఆహారంలో తీసుకోవాలని చెప్పారు. చిన్నారుల్లో పోషక లోపాల నివారణ, బాల్యవివాహాల నిలుపుదలకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సుదీపా, సీడీపీఓ సుధామారుతి, సూపర్‌వైజర్ సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కిల్ స్కామ్‌పై దృష్టి మరల్చేందుకే టీడీపీ రగడ



మాట్లాడుతున్న చింతపల్లి హరిబాబు

టంగుటూరు: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో జరిగిన రూ.371 కోట్ల అవినీతిలో చంద్రబాబే ప్రధాన నిందితుడనే విషయంపై చర్చను అడ్డుకునేందుకే అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు అలజడి సృష్టించారని వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు విమర్శించారు. అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేల వికృత చేష్టలను నిరసిస్తూ మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో టంగుటూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతపల్లి హరిబాబు మాట్లాడుతూ.. టీడీపీ ఎమ్మెల్యేలు పోడియం పైకి వెళ్లి కాగితాలు చించి బీసీ సామాజికవర్గానికి చెందిన స్పీకర్ తమ్మినేని సీతారామ్‌పై విసరడం ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనన్నారు. ఎమ్మెల్యే స్వామిపై వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు దాడి చేశారంటూ రోడ్లపై టీడీపీ కార్యకర్తలు రోడ్డెక్కడం వారి దుష్టబుద్ధికి నిదర్శనమన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మరుగుదొడ్ల పథకం మాటున ఎమ్మెల్యే స్వామి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, దీనిపై బహిరంగ చర్చకు రావాలని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు సవాల్ చేసినా తోక ముడిచారని ఎద్దేవా చేశారు. తొలుత వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, టీడీపీ ఎమ్మెల్యేలకు మంచి బుద్ధి ప్రసాదించాలంటూ వినతిపత్రం అందజేశారు. సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవకుమార్ రెడ్డి, ఎంపీటీసీ ప్రభుదాస్, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, వడ్డేల కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, కొండపి మండల కన్వీనర్ గోగినేని వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు బీనీడి ఉదయకుమార్, వైఎస్సార్ టీఎఫ్ నాయకులు సూదనగుంట వెంకటస్వామి, తన్నీరు వీరనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, సింగరాయకొండ మండల జేసీఎస్ అధ్యక్షుడు తన్నీరు సుబ్బారావు, షేక్ సలీంబాషా, షేక్ పటేల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.